క్లుప్తంగా

ఘనంగా వల్లభేశ్వరస్వామి ఉత్సవం



ఉత్సవ పూజలందుకున్న శ్రీ వల్లభేశ్వర స్వామి

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీ వల్లభేశ్వరస్వామి ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తీరంలో కొండపై వేంచేసియున్న శ్రీ వల్లభేశ్వరస్వామిని దర్శించుకునేందుకు గ్రామస్తులతో పాటు, పరిసర ప్రాంతాల వారు కూడా అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



సంపద తయారీ కేంద్రంలో వర్మీని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ వెంకటలక్ష్మి

మునగపాక : మండలంలోని నాగులాపల్లి పంచాయతీని శుక్రవారం ఈవోఆర్డీ వెంకటలక్ష్మి సందర్శించారు. పంచాయతీలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సమస్య, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె వర్మీ కంపోస్టు పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఉన్నారు.


పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



తోటాడ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

మునగపాక : తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంతో పాటు మొక్కల పంపిణీ చేపట్టారు. విశాఖ కంటి ఆస్పత్రి, మోసిస్ స్కూల్ సంయుక్త నిర్వహణలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కంటి ఆపరేషన్లకు కొంతమందిని గుర్తించారు. వారికి లుపిన్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఫౌండేషన్ మేనేజర్ వెంకట నారాయణ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 520 మొక్కలను హైస్కూల్‌కు అందజేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, క్యాంపు ఆర్గనైజర్ సాయికృష్ణ, హెచ్ఎం కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



కుమారపురంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎస్ఐ పి.ప్రసాదరావు సందర్శించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కుమారపురంలోని పోలింగ్ కేంద్రంలో పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. ఆయన వెంట లక్ష్మీనారాయణ, రమణ పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మునగపాక : మెలిపాక శివారు లాటరీ బల్లాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.26,560 నగదు స్వాధీనం చేసుకున్నారు. లాటరీ బల్లాటాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ పి.ప్రసాదరావు శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.26,560 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

నులి పురుగును నులిమేద్దాం

- పాఠశాలల్లో డీ వార్మింగ్ డే
- విద్యార్థులకు మాత్రల పంపిణీ



పాయకరావుపేట పాఠశాల్లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మాత్ర వేసుకుంటున్న విద్యార్థిని



పురుషోత్తపురం హైస్కూల్లో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో

యలమంచిలి : నులిపురుగు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి మండల ఎంపీడీవో కె.అప్పలనాయుడు అన్నారు. నేషనల్ డీ వార్మింగ్ డేలో భాగంగా శుక్రవారం మండలంలో పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులిపురుగుల నివారణ వల్ల విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంగా జీవించడానికి వీలుగా ఉంటుందని రోగ నియంత్రణ దిశగా పయనించవచ్చునని శారీరకంగా దృఢంగా ఎదగవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి పాఠశాలల్లో, అంగన్‌వాడీల్లో ఈ మాత్రలను తప్పకుండా విద్యార్థులకు అందజేయాలని, తల్లిదండ్రులకు పిల్లల్లో నులిపురుగు నివారణపై అవగాహన కల్పించి మాత్రలు వేసేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అధికారులు దేవీ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలో గల పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పిహెచ్‌సి పరిధిలో గల కళాశాలలు, పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పాయకరావుపేట పీహెచ్‌సీలో 13589 మంది పిల్లలకు మాత్రలు వేయవలసి ఉంది. మంగవరం పీహెచ్‌సీ పరిధిలో 3500 మంది విద్యార్థులకు, పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు వేయడం లక్ష్యం అని పిహెచ్‌సి సిబ్బంది శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో కూడా విద్యార్థులకు వైద్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేస్తున్నారు.

రాంబిల్లి: మండలంలో రాంబిల్లి , దిమిలి పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ జరిగింది. రాంబిల్లి పీహెచ్‌సీ పరిధిలో 4239 మంది లక్ష్యం కాగా 4057 మందికి పంపిణీ చేసారు. దిమిలి పీహెచ్‌సీ పరిధిలో 4566 లక్ష్యం కాగా 4315 మందికి పంపిణీ చేసినట్లు డాక్టర్ వెంకటేష్ తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ భర్త జీవీవీ రమణమూర్తిరాజు(శ్రీనుబాబు), రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దీపిక వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

3192 మందికి అల్బెండిజోల్ మాత్రల పంపిణీ...

అచ్యుతాపురం : మండలంలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని 3192 మంది విద్యార్థులకు ఆల్బెండిజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జగన్నాథపురంలో పాఠశాలలో ప్రారంభించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఏడీ ఎండీహెచ్‌ఓ బాలాజీ పాల్గొన్నారు. విద్యార్థుల గోళ్లకు మట్టి లేకుండా శుభ్రపరచుకోవాలని సూచించారు. భోజనం చేసే ముందు చేతులు నీళ్లతో శుభ్రం చేసుకోవాలని అన్నారు.

ఎస్.రాయవరం : పిల్లలకు విధిగా అల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులు నివారణ చేపట్టాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి అన్నారు. మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించి అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వైద్య సిబ్బంది సూచనలు ఇచ్చారు.

రక్తహీనతను అరికట్టడానికే...

కోటవురట్ల: పిల్లల్లో రక్తహీనతను అరికట్టేందుకే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ అన్నారు. మండలంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిణి ఉదయశ్రీ, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో 5,153 మంది చిన్నారులు లక్ష్యం కాగా 5,115 మందితో మాత్రలు మింగించినట్టు వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. 99 శాతం నమోదైందని, మిగిలిన చిన్నారులతో కూడా మాత్రలు మింగించనున్నట్టు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉన్న నాడే చదువుపై దృష్టి సారించవచ్చని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మూలపేటలో పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు ఉంటే ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. నివారణకు మాత్రలు వేసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- పరిశ్రమల్లో కార్మికులకు అవగాహన



పరిశ్రమ కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎలక్షన్ నోడల్ అధికారి అప్పలనాయుడు

యలమంచిలి : ప్రజలతో ఎన్నుకునే ప్రభుత్వంలో ప్రతి పౌరుడు కీలక భూమిక పోషించాలని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు వాలని యలమంచిలి మండల ఎలక్షన్ నోడల్ అధికారి కె. అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం యలమంచిలి మండలం ములకలాపల్లి సిమెంట్ కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగంపై వివరించారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ప్రతి ఒక్కరూ, తమ వివరాలతో 18 సంవత్సరాలు నిండి ఓటు నమోదు చేయించుకున్నవారు తప్పకుండా సార్వత్రిక ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రత్యక్షంగా తమ వ్యక్తిగత అభిప్రాయంతో ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని, ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ఓటరు పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా పరిశ్రమల్లో ఉద్యోగరీత్యా ఉన్నతమైన వృత్తుల్లో ఉన్న వారు, ఉపాధి నిమిత్తం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వారు ఓటును వినియోగించుకోవాలని, ఓటు నమోదు చేయించుకున్నవారు ఎన్నికలకు దూరంగా ఉండరాదని అన్నారు. కార్యక్రమంలో మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, మండల అధికారులు, దేవీప్రసాద్, ఎలక్షన్ డీటీలు సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలతో పోలింగ్ డెమో



ఈవీఎం మిషన్ ద్వారా పోలింగ్ డెమో నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌కుమార్

ఎస్.రాయవరం : ఎన్నికల్లో ఈవీఎం ఓటింగ్ ద్వారా ఎటువంటి తప్పిదాలు చోటుచేసుకునే పరిస్థితులు ఉండవని ఇన్ చార్జ్ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ అన్నారు. పెదగుమ్మలూరు, నీలాద్రిపురం పోలింగ్ బూత్‌లలో శుక్రవారం ఈవీఎం మిషన్ల ద్వారా పోలింగ్ డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ప్రతి ఓటరూ అవగాహన కలిగించుకోవాలన్నారు. ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు విధిగా పాటించాలి



వ్యాసరచన పోటీల్లో విజేతలతో మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు

యలమంచిలి : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రహదారి భద్రతా నియమాలు కార్మికులంతా విధిగా పాటించాలని మైహోమ్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.హెచ్ చౌదరి అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యలమంచిలి మండలం ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీలో డ్రైవర్లు, కార్మికులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం జాతీయ రహదారులపై ప్రమాదాలకు కారణం రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లనేనని అన్నారు. సేఫ్టీ బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని వర్కర్స్‌కు సూచనలందించారు. జాతీయ భద్రత వారోత్సవాలు పురస్కరించుకుని ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం బి.రామస్వామి, సీనియర్ డీజీఎంఎల్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్, సతీష్‌రెడ్డి, కర్మాగారం కార్మికులు, ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

కోటవురట్ల: రహదారి భద్రతను పాటించి కుటుంబాలతో సంతోషంగా ఉండాలని వెలుగు సిబ్బంది నినదించారు. ఐకేపీ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై చైతన్యం కలిగిస్తూ వెలుగు సిబ్బంది శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక స్త్రీ శక్తి భవనం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. మండల కేంద్రం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగం వద్దని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి ఏపీఎం కరుణానిధి, సీసీ వల్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



మునగపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం మునగపాకలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ట్రాఫిక్ భద్రతపై ఆమె మాట్లాడారు. వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమన్నారు. వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏపీఎం కొండమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఏఎస్ఐ మన్మథరావు, వెలుగు సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

364 మందికి వైద్య పరీక్షలు

- జగన్నాథపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష
- పరిశీలించిన ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ బాలాజీ



ఎం.జగన్నాథపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరంలో భాగంగా వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ బాలాజీ

అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాథపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 364 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్‌ను ఏడీఎంహెచ్‌ఓ వీ.బాలాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా తీవ్రమైన అనారోగ్యం ఉన్న రోగిని ఉన్నత ఆస్పత్రికి రిఫర్ చేశారు. 32 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కళ్లద్దాలు అందజేయగా, కాటరాక్ట్ సర్జరీకి ఆరుగురికి సిఫారసు చేశారు. శ్రీసిద్ధి సాయి స్కూల్‌లో నిర్వహించిన నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన బాలాజీ విద్యార్థులతో మాట్లాడారు. ఆర్థో స్పెషలిస్టు ఎ.వసంతకుమారి, మెడికల్ ఆఫీసర్ కళ్యాణి, గైనకాలజిస్టు ఇందు భార్గవి, పిడియాట్రిషియన్ గ్లోరీ తాబియా,భీముని వెంకటేశ్వరరావు,పైలా రాంబాబు,గొర్లె శ్రీను,కాశీనాయుడు పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాల పనితీరు మెరుగుపరుచుకోవాలి..

కోటవురట్ల : గ్రామ సంఘాల పనితీరును మెరుగుపరుచుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని స్త్రీనిధి ఏపీఎం కరుణానిధి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘాల పనితీరు, ఎంఎస్ జమలు, ఖర్చులు, సీఐఎఫ్ రికవరీ, కొత్త రుణాల మంజూరు, ఆరోగ్యశ్రీ యాప్ ఇన్‌స్టాలేషన్, పీఎం విశ్వకర్మ పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు చేరువయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం కరుణానిధి సూచించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గణపర్తిలో నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన

మునగపాక : గణపర్తి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పలు అభివృద్ధి పనులను రమణమూర్తిరాజు ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి

మునగపాక : టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా టీబీ అధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ కోరారు. మునగపాక పీహెచ్‌సీలో మునగపాక, అనకాపల్లి, కశింకోట మండలాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ వ్యాధి గ్రస్తులకు పోషకాహారం అందించేలా దాతలను గుర్తించాలన్నారు. టీబీ విముక్త గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. దేశంలో 51 శాతం మరణాలు టీబీ వల్లనే జరుగుతున్నాయన్నారు. మరణాలను తగ్గించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా టీబీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.అయ్యప్పరెడ్డి, వైద్యాధికారి విమలగిరి, సూపర్‌వైజర్ ఎం.రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యకారులకు బోట్ల పంపిణీ

అచ్యుతాపురం : మండల పరిధిలోని కొండకర్ల ఆవలో శుక్రవారం మత్స్యకారులకు నాలుగు పడవలను రాంకీ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రీ సస్టయినబిలిటీ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా ఆవలో చేపలు విడుదల చేశారు. ఎం.వి రామిరెడ్డి, డాక్టర్ సుజీవ్ నాయర్, రవికుమార్, కనిమెట్ట శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేశ్వరి, శివారెడ్డి, మళ్ల రమణ పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కేబుళ్ల ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఈ మహేంద్రనాథ్

నక్కపల్లి : మండలంలో మెరక గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న కరెంటు సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో అధికారులకు చర్యలు చేపట్టారు. గొడిచర్ల సబ్‌స్టేసన్ పరిధిలో జి.కొత్తూరు, డి.కొత్తూరు, డొంకాడ, జగన్నథపురం, సీతానగరం, చీడిక కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, మోటార్లకు నిరంతరం విద్యుత్ సరఫరా లేక రైతులు నష్టపోతున్నారంటూ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీల ఆధ్వర్యంలో రైతుల బృందం వారం రోజుల క్రితం వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే ఆయన జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌కో సీఎండీలతో మాట్లాడడంతో ఆయన స్పందించి ఎస్ఈ, డీఈలను క్షేత్ర స్థాయి పర్యటనకు పంపించారు. మూడురోజుల క్రితం ఈ ఇద్దరు ఉన్నతాధికారులు గొడిచర్ల, వేంపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో పర్యటించి సమస్యలపై అధ్యయనం చేశారు. ప్రస్తుతం ఈ గ్రామాలకు రేబాక ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. పక్కనే ఉన్న గొడిచర్ల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి కేబుళ్లు వేయాల్సి ఉంది. దీనికోసం రైల్వేశాఖ అనుమతి కోసం లేఖ రాశారు. రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి 11 కేవీకి సంబంధించి 185 ఎస్క్యూఎం కేబుల్ ఏర్పాటు, కేబుల్ ట్రెంచ్ పైపుతో సహా ఏర్పాటు చేయడం, తదితర విద్యుత్ పరికరాల కోసం రూ.9.78 లక్షలతో ప్రతిపాదలను ప్రభుత్వానికి పంపించారు. గొడిచర్ల సబ్‌స్టేషన్ నుంచి ఈ ఏడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అవసరమైన 0.8 కిలోమీటర్ల దూరం 11 కేవీ విద్యుత్‌లైను, స్తంభాలు, 0.03 డబుల్ కన్వర్షన్ సర్క్యూట్, విద్యుత్ లైను ఏర్పాటు, 9.1 పిఎస్‌సీసీ పోల్స్ ఏర్పాటు, ఇతర మెటీరియల్ కోసం మరో రూ.6.50 లక్షలతో ప్రతిపాదనలను ట్రాన్స్‌కో సీఎండీకి పంపించారు. ఈ నిధులు మంజూరైతే మెరక గ్రామాల్లో విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం జరుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు.

ఉపాధిలో అవకతవకలు రుజువైతే చర్యలు



సచివాలయం నిర్మించలేదంటూ ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

నక్కపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్ల అవకతవకలు జరిగినట్టు తేలితే సంబంధితత వీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని ఏపీడీ రోజారమణి తెలిపారు. శుక్రవారం మండల ఉపాధి కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ, మండల ప్రజావేదిక నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో సుమారు రూ.13 కోట్ల నిధులు వ్యయానికి సంబంధించి ఆడిట్ నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన తనిఖీల్లో చాలా చోట్ల మస్టర్లపై వేలి ముద్రలు లేవని, పనిలోకి రాకుండా వేతనాలు చెల్లించడం, పనులు చేయకుండానే చేసినట్టు రికార్డుల్లో నమోదు చేయడం, చేసిన పనులకు ఆధారాలు చూపకపోవడం, పనులు జరిగిన చోట బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి అవకతవకలను గుర్తించారు. వాటికి ఆయా వీఆర్‌పీలను బాధ్యులను చేస్తున్నామన్నారు. సంబంధిత నిధులను వీఆర్‌పీలతో రికవరీ చేస్తామన్నారు. నక్కపల్లి, రేబాక గ్రామాలకు మంజూరైన సచివాలయాలను కాంట్రాక్టర్ నిర్మించలేదని, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తదితరులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, మండలంలో అన్ని గ్రామాల్లో సచివాలయాలు పూర్తి చేసి సేవలు అందిస్తుండగా, ఈ రెండు గ్రామాల్లో మాత్రం సచివాలయాలు పూర్తి చేయలేదని అన్నారు. కాంట్రాక్టర్ ప్రభుత్వం నుంచి నిధులు కూడా పొందినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సచివాలయాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అంబుడ్స్‌మన్ చిన్నయ్యదొరకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఏపీవో ఈశ్వరరావు, పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తెలుగువారి కీర్తి కిరీటం పీవీ

నక్కపల్లి : మాజీ ప్రధాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బహుభాషా కోవిదుడు, తెలుగువాడైన పీవీ నర్సింహరావుకు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడం పట్ల నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డీవీ రామారావు, గొట్టుముక్కల వరప్రసాద్, శ్రీపాద ప్రణమ్‌రామ్ తదితరులు హర్షం ప్రకటించారు. దేశానికి పీవీ చేసిన సేవలు, పరిపాలనలో ఆయన తెచ్చిన సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలు చేకూర్చాయన్నారు. బహుభాషా కోవిదుడిగా, రాజనీతిజ్ఞుడిగా దేశానికి ఎనలేని ఖ్యాతిని తీసుకువచ్చారన్నారు. పీవీతో పాటు, ఎల్‌కే అద్వానీ, కర్పూర ఠాకూర్, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌లకూ కూడా భారతరత్న ప్రకటించడం పట్ల బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు శ్రీపాద సత్యదేవ శర్మ, ఎ.రామకృష్ణ, డి.మురళీకృష్ణ, ఇంద్రకంటి బాబి, శ్రీపాద సత్యప్రసాద్, వరసకొండ పండు హర్షం ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల హర్షం..

పీవీ నర్సింహరావుకు భారతరత్న ప్రకటించడం పట్ల రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ కాసుబాబు తదితరులు హర్షం ప్రకటించారు. పీవీ దేశానికి చేసిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. అద్వానీ, చరణ్‌సింగ్, ఠాకూర్, స్వామినాథన్‌లకు కూడా అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేయడం గర్వంగా ఉందన్నారు. అలాగే జన రంజకమైన సంక్షేమ పథకాల అమలు రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని స్థాపించి చనిపోయిన తర్వాత కూడా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు కూడా భారతరత్న ప్రకటించాలని వారు కోరారు.

ఎమ్మెల్యే కన్నబాబు హర్షం

యలమంచిలి రూరల్ : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు, గాయత్రీ సేవా ట్రస్టు కార్యదర్శి, వేద పాఠశాల నిర్వాహకుడు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, ట్రస్టు అధ్యక్షుడు అచ్చళ్ల వీర, యలమంచిలి తాలూక పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వర్రావు, కూచి దత్తాత్రేయ, పలువురు బ్రాహ్మణ సంఘం పెద్దలు హర్షం ప్రకటించారు.

జగనన్న సురక్షతో నాణ్యమైన వైద్యం



జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సత్యనారాయణమూర్తి



రాజయ్యపేటలో రోగులకు మందులు అందజేస్తున్న నాయకులు

ఎస్.రాయవరం : గ్రామాల్లో జగనన్న సురక్ష వైద్య శిబిరాల్లో ఎక్కువ మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందుతోందని ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి అన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో లింగరాజుపాలెం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి శక్తిప్రియతో పాటు నక్కపల్లి, అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్యసేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో 352 మందికి వైద్య పరీక్షలు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం ఒకరిని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే వైద్యాన్ని తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాజయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులను ఏయే సమస్యలతో వచ్చారో అడిగి తెలుసుకున్నారు. వారికి వైద్యులతో అన్ని రకాల పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు సూరిబాబు, యజ్జల అప్పలరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.